

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 60 | ఎడిటర్ : బరిగెల శివ | శుక్రవారం 30, జనవరి 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాజ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్




# వీరుని పోరులో.. ధీరత్వం



పోరాటాలకు శక్తి సామర్థ్యాలతో పనిలేదు

పటిష్టమైన ఆత్మగౌమే ప్రజా సంక్షేమం కొరకు పని చేయగలదు

ప్రభుత్వాల పేరు చెప్పుకొని దోచుకొనటోల్ల భరతం పడుతున్నాం

పెద్ద పేపర్లన్నీ పేరుకేనా ప్రజా సమస్యలు పట్టవా

ప్రభుత్వాలను జోకుడేంది ప్రజల్లో పలచన అవ్వడమేంది

నేటి సమాజంలో కల్పితాల కోసమే కదంతొక్కే వాళ్ళ సంఖ్య పెరుగుతుంది

వ్యాపారాలకు ఎగబడుతున్న జర్నలిస్టు సంస్థలు

ప్రజా సొమ్మును దుర్వినియోగపరచడంపై ప్రశ్నించేది లేదా

ప్రజల తరపున పోరాడడం దేవుడు ఇచ్చిన గొప్ప వరం

ఆత్మగౌరవంతో పోరాటం చేస్తే ఉపఖండాలు దాటే పేరువస్తుంది

డాక్టర్ బరిగెల శివ

**హైదరాబాద్ జై భీమ్ డెస్క్:-**

ప్రజా సమస్యల పట్ల పోరాడాల్సిన శక్తులు వ్యాపారాలకు అలవాటు పడుతున్నాయని డాక్టర్ బరిగెల శివ తీవ్రంగా విమర్శించారు. దేశం మొత్తం పైసా చుట్టూ తిరుగుతుందని ప్రతి ఒక్కరు పైస సంపాదన కోసం పరిభ్రమిస్తున్నారే తప్ప ప్రజల బాధ, వ్యదలను, పట్టించుకోవడం మానేస్తున్నారన్నారు. ప్రజా సమస్యల పట్ల నిజాయితీగా పోరాటం చేయాలంటే నిలువెత్తు ఆత్మగౌరవం ఉండాలన్నారు. మాటలు మాట్లాడినంత సులువుగా చేతలు చేయడం చాలా కష్టతరమని పది సంవత్సరాలుగా నేను నిర్మించుకున్న జై భీమ్ సంస్థ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా మాత్రమే పనిచేయగలుగుతుందని విశ్వాసంగా చెప్పగలమన్నారు. పైసల సంపాదనే మార్గం అనుకుంటే ఎన్నో

- మిగతా 2లో..




## ఫోన్ ట్యాపింగ్... కేసీఆర్ అభ్యర్థనకు అంగీకరించిన సిట్... కానీ!

రేపు విచారణకు హాజరు కాలేనన్న కేసీఆర్

కేసీఆర్‌కు సమయం ఇవ్వాలని సిట్ నిర్ణయం

ఫామ్ హౌస్‌లో విచారించాలన్న విజ్ఞప్తిపై న్యాయసలహా తీసుకొనున్న సిట్

రేపు తదుపరి విచారణ తేదీతో మరోసారి నోటీసులు



2

## రాహుల్ గాంధీ, ఖర్గేలతో సమావేశమైన శశిథరూర్

కొంత కాలంగా కాంగ్రెస్ పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉంటున్న థరూర్

ఈ ఉదయం రాహుల్, ఖర్గేలతో థరూర్ భేటీ

అరగంట పాటు కొనసాగిన సమావేశం

2



## ఇది విచారణ కాదు... ప్రతీకారం: కేసీఆర్‌కు సిట్ నోటీసులపై కేటీఆర్ ఫైర్

3

కేసీఆర్ కు సిట్ నోటీసులు.. కేసు విచారణ సీరియస్ గా జరగడం లేదన్న కవిత

ఎన్నికలు ఉన్నందునే కేసీఆర్ కు నోటీసులు ఇచ్చారన్న కవిత

కేసును త్వరగా ముగించాల్సిన అవసరం ఉందని వ్యాఖ్య

3





## ఆత్మవిశ్వాస భారత్‌కు ఈయూ ఒప్పందం నిదర్శనం: ప్రధాని మోదీ

భారత్-ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు

నాణ్యతతో యూరప్ మార్కెట్లను గెలుచుకోవాలని తయారీదారులకు సూచన

'వికసిత్ భారత్ 2047' సాధన దిశగా ప్రభుత్వం ముందుకు వెళ్తోందని స్పష్టీకరణ

తొమ్మిదోసారి బడ్జెట్ ప్రవేశపెట్టడంపై నిర్మలా సీతారామన్‌ను అభినందించిన మోదీ

2

## ఆత్మవిశ్వాస భారత్‌కు ఈయూ ఒప్పందం నిదర్శనం: ప్రధాని మోదీ



బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ పార్లమెంట్ వెలుపల మీడియాతో మాట్లాడారు. భారత్-యూరోపియన్ యూనియన్ మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఫ్టీఏ), "ఆశావహ, ఆత్మవిశ్వాస, ఆత్మనిర్భర్ భారత్" స్ఫూర్తిని ప్రతిబింబిస్తోందని అన్నారు. 21వ శతాబ్దపు ఈ త్రైమాసికంలో భారతదేశం ప్రపంచానికి ఒక ఆశాకిరణంగా, ఆకర్షణ కేంద్రంగా మారిందని పేర్కొన్నారు. దేశ ఆర్థిక, ప్రజాస్వామ్య బలంపై ప్రపంచానికి పెరుగుతున్న విశ్వాసానికి ఇదే నిదర్శనమని తెలిపారు.

ఈ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ద్వారా భారతదేశానికి, ముఖ్యంగా యువతకు ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. "భారత్, యూరప్ మధ్య ఈ చారిత్రాత్మక ఒప్పందం కుదిరినప్పుడు మన పారిశ్రామికవేత్తలు, తయారీదారులు కేవలం పన్నుల తగ్గింపు గురించే ఆలోచించకూడదు. ఇది నాణ్యతను చాటుకోవాల్సిన గొప్ప అవకాశం. ఇప్పుడు మార్కెట్ మన కోసం తెరుచుకుంది. అత్యుత్తమ నాణ్యతతో యూరప్‌లోని 27 దేశాల హృదయాలను మనం గెలుచుకోవాలి. ఇది దీర్ఘకాలంలో మనకు ఎంతో మేలు చేస్తుంది" అని ప్రధాని వివరించారు. ఈ ఒప్పందం ద్వారా భారత రైతులు, యువత, సేవల రంగంలోని నిపుణులకు ప్రపంచ మార్కెట్లలో గణనీయమైన అవకాశాలు లభిస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు.

వికసిత్ భారత్ లక్ష్య సాధనలో బడ్జెట్ సమావేశాలు కీలకం: ప్రధాని

2047 నాటికి 'వికసిత్ భారత్' సాధించాలనే సంకల్పంలో ఈ బడ్జెట్ సమావేశాలు ఒక ముఖ్యమైన అడుగు అని ప్రధాని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం 'రిఫార్మ్ ఎక్స్‌ప్రెస్'పై వేగంగా ముందుకు సాగుతోందని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపుతోందని తెలిపారు. తమ ప్రభుత్వ పనితీరు "సంస్కరణ, పనితీరు, పరివర్తన" అనే సూత్రంపై ఆధారపడి ఉంటుందని స్పష్టం చేశారు. టెక్నాలజీని అందిపుచ్చుకుంటూనే, మానవతా దృక్పథాన్ని విస్మరించబోమని, చిట్టచివరి వ్యక్తి వరకు లబ్ధి చేకూరేలా చూస్తామని హామీ ఇచ్చారు.

వరుసగా 9వ బడ్జెట్.. నిర్మలా సీతారామన్‌పై మోదీ ప్రశంసలు

అలాగే, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వరుసగా తొమ్మిదోసారి బడ్జెట్ ప్రవేశపెట్టడం దేశ పార్లమెంటరీ చరిత్రలో ఒక గర్వకారణమైన క్షణమని అభివర్ణించారు. అంతకుముందు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పార్లమెంటులో చేసిన ప్రసంగం 140 కోట్ల మంది భారతీయుల ఆత్మవిశ్వాసాన్ని, ఆకాంక్షలను ప్రతిబింబించిందని కొనియాడారు. దేశాభివృద్ధిని వేగవంతం చేసేందుకు ఎంపీలందరూ నిర్మాణాత్మక చర్చల్లో పాల్గొనాలని ప్రధాని కోరారు.

## రాహుల్ గాంధీ, ఖర్గేలతో సమావేశమైన శశిథరూర్

కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల్లో ఆ పార్టీ సీనియర్ నేత, ఎంపీ శశిథరూర్ అంటీముట్టనట్టు వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ అనంతరం ప్రధాని మోదీని ప్రశంసిస్తూ శశిథరూర్ పలుమార్లు స్పందించారు. దీంతో, కాంగ్రెస్ తో ఆయన సంబంధాలు మరింత బలహీనపడ్డాయి. ఆయన బీజేపీలో చేరబోతున్నారనే ప్రచారం కూడా ఇటీవలి కాలంలో ఎక్కువైంది. మరోవైపు పార్టీ కీలక సమావేశాలకు కూడా థరూర్ వరుసగా గైర్హాజరు అవుతుండటంతో... ఈ ప్రచారానికి రెక్కలొచ్చినట్టయింది. ఈ క్రమంలో ఈరోజు ఆసక్తకర పరిణామం చోటుచేసుకుంది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేలతో శశిథరూర్ భేటీ అయ్యారు. పార్లమెంటు ప్రాంగణంలో దాదాపు 30 నిమిషాల పాటు వీరి సమావేశం కొనసాగింది. డ్యామేజ్ కంట్రోల్ లో భాగంగా ఈ సమావేశం జరిగినట్టు తెలుస్తోంది. తనవైపు నుంచి వివరణ ఇచ్చేందుకు కాంగ్రెస్ హైకమాండ్ తో సమావేశానికి థరూర్ సమయం కోరినట్టు చెబుతున్నారు. ఈ క్రమంలోనే వీరి సమావేశం చోటుచేసుకుంది.

## ఫోన్ ట్యాపింగ్... కేసీఆర్ అభ్యర్థనకు అంగీకరించిన సిట్... కానీ!


తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల దృష్ట్యా తాను విచారణకు హాజరు కాలేనన్న మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అభ్యర్థనకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అంగీకరించింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ కోసం కేసీఆర్‌కు మరింత సమయం ఇవ్వాలని నిర్ణయించింది. అయితే కేసీఆర్ లేవనెత్తిన పలు అంశాలపై సిట్ న్యాయ సలహా తీసుకోనుంది.న్యాయ నిపుణుల సలహా తీసుకున్న అనంతరం తదుపరి తేదీ, విచారణ చేసే ప్రాంతాన్ని పేర్కొంటూ సిట్ మరోసారి నోటీసులు జారీ చేయనుంది. రేపు తదుపరి విచారణ తేదీని ప్రకటించే అవకాశం ఉంది.కాగా, ఫోన్ ట్యాపింగ్ కేసులో రేపు మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు హాజరు కావాలని కేసీఆర్‌కు సిట్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నామినేషన్లకు రేపు చివరి తేదీ అని, అభ్యర్థులను ఖరారు చేయాల్సి ఉందని పేర్కొన్నారు. 60 ఏళ్లు దాటిన వారిని పోలీస్ స్టేషన్‌కు పిలవకూడదనే నిబంధన ఉందని, తనను ఎర్రవెల్లి ఫామ్ హౌస్‌లోనే విచారించాలని ఆయన విజ్ఞప్తి చేశారు



# వీరుని పోరులో ధీరత్వం

మొదటి పేజీ తరువాయి





రకాల అలవాట్లకు అవకాశాలు ఇచ్చేవారం అన్నారు.దేశంలో జరుగుతున్న పరిస్థితులను తెలుగు రాష్ట్రాల్లో జరుగుతున్న దుస్సంఘటనలను ప్రధాన మీడియాలు ప్రభావితం చేయలేకపోవడం వాటిని ప్రజలకు చూపించడంలో పూర్తిగా విఫలమవుతున్నారని వాటి వలన రాజకీయ శక్తుల ఆగడాలు విచ్చలవిడిగా పెరిగిపోతున్నాయి అన్నారు. ఏ వ్యవస్థలోనైనా మన మొక్కరమే బాగుపడితే సరిపోదని వందల మందికి జీవితాలను ఇస్తూ ఎదగడంలో ఎన్నో కోట్ల ఆస్తి దాగి ఉంటుందన్నారు.నీతి నిజాయితీలను చంపుకొని అక్రమమైన పద్ధతిలో డబ్బులు సంపాదించాలనుకునే మార్గాలు బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తున్న వ్యక్తులలో ఉండకూడదన్నారు.అలాంటి ప్రాథమిక సూత్రాలను నిదర్శనంగా భావించిన నేను సమాజానికి బలమైన సాంకేతాన్ని బలమైన సంకల్పాన్ని ఇవ్వడం కోసం పస్తులతో కూడిన జీవితాన్ని గడిపానన్నది ఎంతో గర్వంగా చెప్పగలనన్నారు.నా ఆత్మవిశ్వాసంతో కూడిన ఆశయం ఎంతో గొప్పగా ఉన్నప్పటికిని ఆర్థిక అసమానతలు నన్ను అదే స్థాయిలో బలవంతంగా వెనక్కి లాగుతున్నాయన్నారు.ఏ సూత్రం లేదు అంతటా ఒకే సూత్రం పైస సంపాదన మాత్రమే వ్యక్తులను అభివృద్ధి చేస్తుందనుకుంటే మూగ జీవరాసులకు అక్రమ వ్యాపారస్తులకు పెద్దగా తేడా ఏముంటుంది అన్నారు.ప్రభుత్వాల తప్పులను ప్రతిపక్షాల పోరాటాలను అన్ని కోణాల్లో అధ్యయనం చేస్తూ వాస్తవ వాస్తవాలను పసిగడుతూ, పరిశీలిస్తూ సమాజాన్ని ప్రభావితం చేయడం అనేది అద్భుత జీవిత ఘట్టంగా భావిస్తానన్నారు.అరుదైన ఆత్మగౌరవాన్ని సంపాదించుకోవడంలో ఉన్న గొప్పతనం ఎన్ని అవార్డులు పొందిన ఎన్ని రివార్డులు పొందిన దక్కదన్నారు.ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వ అధికారులు వృత్తిపరంగా ఉత్తమ అధికార అవార్డులు పొందుకుంటూనే అవినీతి నిరోధక శాఖలకు కనురెప్ప పాటులో చిక్కిపోతున్నారన్నారు.ప్రతి మనిషి జీవితంలో ఆత్మగౌరవం చాలా ప్రభావవంతమైనదని శక్తి వంచన లేకుండా హెచ్చుతగ్గులు లేకుండా మానవత్వ విలువల మీద మాత్రమే ఆత్మగౌరవం ఆధారపడి ఉంటుందని దానిని మనస్ఫూర్తిగా నమ్ముకొని పని చేయగలిగిన వ్యక్తి ఎంత ఉన్నతమైన స్థాయికి ఎదిగిన చెక్కుచెదరరు అన్నారు.ఆత్మగౌరవం లేని వ్యక్తులు ఎంత ఉన్నతమైన స్థానాలను అధిరోహించిన తప్పకుండా కింద పడిపోక తప్పదన్నారు.అశాశ్వతమైన ఆశయాలను బలపరచడం కోసం రాజకీయ శక్తులుగా కొంతమంది అధికార శక్తులుగా మరికొంతమంది వ్యాపార శక్తులుగా ఇంకొంతమంది తయారవుతూ సమాజంపై దాడులు చేస్తున్నారని వాటన్నిటిని జాగ్రత్తగా పసగట్టాల్సిన ప్రభుత్వ వ్యవస్థలు ప్రభుత్వ యంత్రాంగాలకు లొంగిపోతున్నాయన్నారు.సమాజంపై జరుగుతున్న దాడులను పోరాటాల రూపంలో రక్షించుకుంటున్న యువకులు అర్బన్ నక్సలైట్ల ముద్రలు వేసుకుంటూ ఎంతో మనోవేదన చెందుతున్నారన్నారు.పోరాటమే తప్పయితే సమాజాన్ని ఎందుకు నాశనం చేస్తున్నారంటూ నిలదీశారు.ప్రభుత్వాల ద్వారా మేలు పొందుకోవాలనుకోవడం ప్రతి పౌరుల హక్కు అని దానిని ఎవ్వరూ కాలరాయడానికి లేదన్నారు.సాంకేతిక అభివృద్ధి వైపు అడుగులేస్తున్న సమాజం ఎందుకు పతనావస్థ స్థితికి దిగజారిపోతుందన్నారు.పాలకుల లోపం వల్లే ప్రజలు మదన పడుతున్నారని వాటిని ఏమాత్రం పట్టించుకోకుండా ఆధిపత్యపు పోరు కోసం కొంతమంది ఆహ్లాదకరమైన ఆనందాల కోసం మరికొంతమంది,అక్రమమైన ఆస్తుల సంపాదన కోసం లెక్కలేనంతమంది ఆరాట పడుతున్నారే తప్ప రాజకీయ ఆశయాల కోసం పనిచేయడం లేదన్నారు.ప్రభుత్వాలను విమర్శిస్తే ప్రభుత్వ అధికార యంత్రాంగాలు ఉవ్వెత్తున ఎగిరి పడుతున్నాయన్నారు.ప్రభుత్వ అధికార వ్యవస్థలు డెబ్బై శాతం పతనవస్థ స్థితిలో ఉన్నాయని వాటికి కారకులు ఎవరో పసిగట్టకుండా పోరాటంలో ధీరత్వాన్ని ప్రదర్శిస్తున్న మాలాంటి సాధరణ ఆత్మగౌరవం కలిగిన వ్యక్తులను అడుగడుగునా, అనువణువునా అవమానాలకు గురి చేస్తూ మా కీర్తి ప్రతిష్టలపై దెబ్బ కొట్టాలని చూస్తున్నారు అన్నారు.భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలనే ఉధృతమైన సంకల్పం ఎన్ని కోట్ల విలువ ఆస్తితో సమానమో ఒక్కసారిగా ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు.ప్రభుత్వాలు కొనసాగించబడడానికి భారత రాజ్యాంగమే ప్రధాన కారణమని తెలిసినప్పటికిని ప్రభుత్వాల గెలుపులో ప్రధాన కీలక పాత్ర పోషించిన భారత రాజ్యాంగాన్ని అధికారంలోకి రాగానే ప్రత్యక్షంగా కొంతమంది పరోక్షంగా కొంతమంది తీవ్రంగా అణిచివేతకు గురి చేస్తున్నారన్నారు.నేరుగా భారత రాజ్యాంగం పై దాడి చేస్తేనే దాడి కాదని పరోక్షంగా ప్రజా విలువలను రాజ్యాంగానికి విరుద్ధంగా కొనసాగించడం కూడా రాజ్యాంగంపై దాడి చేయడమే అన్నారు.కొంతమంది ప్రజాప్రతినిధులను, రాజకీయ నాయకులను చూస్తుంటే జాలి అనిపిస్తుంది అన్నారు.ఎలాంటి హంగు ఆర్భాటాలు లేకుండానే కేవలం పైసా పలుకుబడి, వ్యాపారాల ముసుగులో ఎంతో ఉన్నతమైన రాజకీయ శక్తులుగా ఎదుగుతున్నారన్నారు. సంవత్సరాల తరబడి ప్రజా సంక్షేమంలో ప్రజల తరఫున పోరాటాలు చేస్తున్న మాలాంటి యువకుల జీవిత భవిష్యత్తుకు అర్థం ఏమిటో తెలియదు గానీ వేలమంది ఉద్యమ వీరులు వేల మంది అమరవీరులు వేల మంది త్యాగమూర్తుల ఆత్మగలమే ఆత్మీయ గౌరవంగా మారి పోరాటాల రూపంలో ప్రజల తరఫున మాలాంటి యువశక్తుల రూపంలో నిలబడుతుందన్నారు అదే డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగ రక్షణకు మూల స్తంభంగా నిలుస్తుందని అనడంలో ఎలాంటి సందేహాలతో పనిలేదన్నారు.దేశవ్యాప్తంగా ప్రతి రాష్ట్రంలో కులగజ్జి రాజకీయాలు విచ్చలవిడిగా పెరిగిపోతున్నాయని అలాంటి సందర్భంలో నిమ్న జాతీయులలో ఐక్యత లోపం పూర్తిగా నశిస్తున్నందువల్లనే మాలాంటి సామర్థ్యం కలిగిన యువ ఆత్మగౌరవ జర్నలిస్టులు ఎంత పోరాటం చేసిన మరుగున పడుతున్నారు తప్ప అభివృద్ధి చెందడం లేదన్నారు.ప్రభుత్వాలకు ప్రజాప్రతినిధులకు పార్టీ ఫండ్స్ ఇవ్వడంలో ఎక్కడ వెనకాడని బడా బాబులు కులాలకు అతీతంగా మతాలకతీతంగా జాతులకు అతీతంగా సమాజం కొరకు పోరాటం చేసే మాలాంటి సామాన్యులను ఆదుకోవడంలో మాత్రం ఎందుకో ఏమో గాని కులాన్ని చూస్తున్నారన్నారు.సామాజిక వర్గంగా వెనుకబడిన షెడ్యూల్ కులాలకు చెందిన వారమైనప్పటికిని భారత రాజ్యాంగాన్ని భుజాన వేసుకోవడమనేది భవిష్యత్తు నిర్మాణాన్ని పటిష్టంగా తయారు చేసే పోరాట వీరత్వంలో ధీరత్వాన్ని ప్రదర్శించగలమన్నారు.మాలాంటి సమాచారక్షణ పోరాట యోధులను వేల మందిని తయారు చేయగలమన్నారు.సమాజానికి ఆదర్శంగా నిలబడాలంటే స్థాయికి మించి శక్తికి మించి ఆర్థిక స్తోమతకు మించి పది రేట్లు ఎక్కువగా కష్టపడాలన్నారు.ఆర్థికంగా ఈరోజు కాకపోతే రేపైనా ఎదుగగలం గాని ఆత్మగౌరవం అనేది ఎన్ని కోట్లు పెట్టినా రాదన్నారు.ప్రతి సామాజిక వర్గంలో ఆత్మగౌరవంతో జీవించాలనే వ్యక్తిత్వ స్వభావాలు పెంపొందించబడిన నాడు మాలాంటి యువకులు జర్నలిస్టు సంస్థలను నిర్మించుకొని పోరాటమే జీవితంగా భావిస్తూ కొనసాగాల్సిన భారము, బాధ్యత కాస్తయినా తగ్గుతుందన్నారు.సమాజ రక్షణను భారంగా భావిస్తున్న భావి భారత యువకులు వ్యసనాలకలవాడు పడుతూ జీవితాలను అస్తవ్యస్తం చేసుకుంటుండగా సమాజాన్ని కాపాడాల్సిన రాజకీయ నాయకులు వ్యాపారస్తులు ప్రభుత్వ అధికారులు పైసల సంపాదనలో మునిగిపోయి ఆత్మగౌరవాన్ని అమ్ముకుంటున్నారన్నారు.నేను సైతం ప్రజాస్వామ్య రక్షణకు సమాజ ఆత్మ గౌరవానికి ప్రత్యేకగా నిలబడుతున్నానని అలాంటప్పుడు విద్యావంతులు మేధావులు యువకులు ఏ విధంగా దోహదపడగలరో ఆత్మ గౌరవ పోరాట పరీక్ష చేసుకోవాలన్నారు.నిరంతరం ఎన్నో సమస్యల మీద పోరాటం చేస్తూ కఠోరమైన సాధనను కొనసాగిస్తున్న జై భీమ్ సంస్థకు అధినేతనైన నాకు నా సిబ్బందికి తెలంగాణ ప్రజల తోడ్పాటు తోపాటు ప్రపంచవ్యాప్తంగా ఉంటున్న తెలుగు ప్రజల ఆదరాభిమానాలు ఉండాలని కోరుకున్నారు.

# ఇది విచారణ కాదు... ప్రతీకారం: కేసీఆర్‌కు సిట్ నోటీసులపై కేటీఆర్ ఫైర్

**కేసీఆర్‌కు సిట్ నోటీసులు ఇవ్వడం కక్ష సాధింపేనన్న కేటీఆర్**
**ప్రభుత్వ వైఫల్యాల నుంచి దృష్టి మరల్చేందుకే ఈ చర్యలని ఆరోపణ**
**చావు నోట్లో తలపెట్టి కేసీఆర్ తెలంగాణ సాధించారని వ్యాఖ్య**
**బెదిరింపులతో తెలంగాణ చరిత్రను చెరపలేరని హెచ్చరిక**
**కాంగ్రెస్ అన్యాయ పాలనపై పోరాటం కొనసాగిస్తామని ప్రకటన**



మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు సిట్ నోటీసులు జారీ చేయడంపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇది విచారణ కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం తమ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు చేస్తున్న రాజకీయ ప్రతీకార చర్య అని ఆయన అభివర్ణించారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైన కాంగ్రెస్, పాలనా లోపాలను కప్పిపుచ్చుకునేందుకే ఇలాంటి కక్ష సాధింపు రాజకీయాలకు పాల్పడుతోందని ఆయన మండిపడ్డారు. ఇది కేవలం న్యాయాన్ని అపహాస్యం చేయడమేనని, రాజకీయ దురుద్దేశంతోనే ఈ నోటీసులు ఇచ్చారని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ స్పందిస్తూ.. "చావు నోట్లో తలపెట్టి, సచ్చుడో, తెలంగాణ వచ్చుడో అనే మొక్కవోని దీక్షతో ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన మహానాయకుడు కేసీఆర్. తన పదేళ్ల పాలనలో మిషన్ భగీరథ, రైతుబంధు, దళితబంధు వంటి పథకాలతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపారు. సబ్బండ వర్గాలను కడుపులో పెట్టుకుని చూసుకున్నారు. అలాంటి నాయకుడిపై అబద్ధాల పునాదుల మీద అధికారంలోకి వచ్చిన అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు విచారణల పేరుతో వేధించడం దుర్మార్గం" అని ధ్వజమెత్తారు. తమ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతున్నందుకే బీఆర్ఎస్ అధినేతపై కాంగ్రెస్ కక్ష కట్టిందని కేటీఆర్ ఆరోపించారు. కేసీఆర్ తెలంగాణ ప్రజల గుండెల్లో నిలిచిన నాయకుడని, కేవలం నోటీసులు ఇచ్చి, బెదిరింపులకు పాల్పడి తెలంగాణ ఉద్యమ చరిత్రను, ఆయన కీర్తిని చెరిపేయలేరని హెచ్చరించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని అవమానిస్తే సహించేది లేదని, ప్రజలే సరైన సమయంలో కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెబుతారని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఈ కక్ష సాధింపు రాజకీయాలను తీవ్రంగా ఖండిస్తోందని, ప్రజల పక్షాన నిలబడి కాంగ్రెస్ అన్యాయ పాలనపై తమ పోరాటాన్ని కొనసాగిస్తామని కేటీఆర్ ఉద్ఘాటించారు. చరిత్రను విచారణలతో కాదని, ప్రజల తీర్పుతోనే రాస్తారని ఆయన వ్యాఖ్యానించారు.

## కేసీఆర్ కు సిట్ నోటీసులు.. కేసు విచారణ సీరియస్ గా జరగడం లేదన్న కవిత



ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు సిట్ నోటీసులు ఇవ్వడం ఇరు తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశంగా మారింది. మధ్యాహ్నం 3 గంటలకు విచారణ ఉంటుందని నోటీసుల్లో సిట్ అధికారులు పేర్కొన్నారు. రేపు కేసీఆర్ విచారణ నేపథ్యంలో తెలంగాణలో రాజకీయం వేడెక్కింది. సిట్ నోటీసుల నేపథ్యంలో కేసీఆర్ కూతురు, జాగృతి అధ్యక్షురాలు కవిత స్పందిస్తూ... కీలక వ్యాఖ్యలు చేశారు. మున్సిపల్ ఎన్నికలు ఉన్నందునే కేసీఆర్ కు నోటీసులు ఇచ్చారని ఆరోపించారు. సిట్ విచారణ నాన్-సీరియస్ గా జరుగుతోందని, ఎన్నికల నేపథ్యంలోనే కేసీఆర్ కు నోటీసులు ఇచ్చారని అన్నారు. కేసును సీరియస్ గా తీసుకుని త్వరగా ముగించాల్సిన అవసరం ఉందని... అయితే, కేసును ముగించాలనే ఉద్దేశం ప్రభుత్వానికి ఉందా? లేదా? అనేది ఎవరికీ అర్థం కాని పరిస్థితి ఉందని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ జరగడం నిజంగానే చాలా బాధాకరమని... కానీ, దానికి తగినటువంటి పర్యవసానాలను నేరస్తులు ఎదుర్కొంటారా? లేదా? అనేది వేచిచూడాలని అన్నారు.

# వ్యవసాయ రంగంలో అభివృద్ధికి ముందస్తు ప్రణాళికలు







**పౌర సరఫరా శాఖ వ్యవసాయ శాఖతో సమావేశాన్ని నిర్వహించారు**
**వ్యవసాయ శాఖ అధికారులకు దిశా నిర్దేశం చేసిన కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఐపీఎస్.**
**రైతులకు పూర్తిస్థాయిలో మేలు చేయాలి.**

**హైదరాబాద్ జై భీమ్ న్యూస్:- జనవరి 29, 2026:**

2025-26 ఖరీఫ్ సేకరణను అంచనా వేయడానికి రాబోయే రబీ సీజన్ కోసం రోడ్‌మ్యాప్‌ను ఖరారు చేయడానికి పౌర సరఫరాల శాఖ నేడు వ్యవసాయ శాఖతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించింది.

ముఖ్య ముఖ్యాంశాలు:

రూపాయలు 1,425 కోట్ల బోనస్ విడుదల , సన్న రకాల ప్రచారం: ఈ శాఖ 71.90 ఎల్ఎంటి వరిని విజయవంతంగా సేకరించింది రైతు బకాయిలలో 97.08 శాతం క్లియర్ చేసింది, ఇప్పటివరకు రూపాయలు18,568 కోట్లు విడుదల చేసింది. ఇందులో బోనస్ విలువ కోసం ప్రత్యేకంగా విడుదల చేసిన రూపాయలు 1,425 కోట్లు ఉన్నాయి. రైతులకు ప్రయోజనం చేకూర్చడం కొనసాగించడానికి అధిక మార్కెట్ డిమాండ్ ఉన్న తెలంగాణ సోనా (ఆర్ఎన్ఆర్-15048), హెచ్ఎంటి జైశ్రీరామ్ వంటి ఇష్టపడే సన్న రకాలను పండించాలని గట్టిగా ప్రోత్సహించబడింది. మిల్లింగ్ సమస్యల కారణంగా ఎంటియు 1153 ,కేఎన్ఎమ్ 733 వంటి రకాలను రైతులు జాగ్రత్తగా చూసుకోవాలి.




రబీ సీజన్‌లో ముందస్తుగా విత్తడంపై సలహా: రబీ సీజన్‌లో ముందస్తుగా విత్తడం వల్ల పంట గరిష్ట ఉష్ణోగ్రతలు ప్రారంభమయ్యే ముందు పూర్తవుతుందని, ధాన్యం నష్టాన్ని నివారిస్తుందని మరియు అధిక నాణ్యత గల దిగుబడిని నిర్ధారిస్తుందని రైతులు సూచిస్తున్నారు.

ముందస్తు మౌలిక సదుపాయాల ప్రణాళిక: ఇబ్బంది లేని సీజన్‌ను నిర్ధారించడానికి, పరికరాల ప్రణాళిక ముందుగానే జరుగుతోంది. సేకరణ కేంద్రాలలో కార్యకలాపాలను వేగవంతం చేయడానికి మాన్యువల్ వరి క్లీనర్‌లను ఆటోమేటిక్ వరి క్లీనర్‌లుగా అప్‌గ్రేడ్ చేయడానికి శాఖ ప్రాధాన్యత ఇస్తోంది. అవసరాలను తీర్చడానికి టార్పాలిన్‌లు మరియు తేమ మీటర్లు వంటి ముఖ్యమైన వస్తువులను నిల్వ చేస్తున్నారు.

హుస్నాబాద్‌లో ప్రాధాన్యత మరమ్మతులు: మొంతా తుఫాను ప్రభావాన్ని పరిష్కరించడానికి, హుస్నాబాద్‌లోని గోడౌన్‌ల తక్షణ మరమ్మత్తు పునరుద్ధరణకు శాఖ ప్రాధాన్యతనిచ్చింది.

## వికారాబాద్ జిల్లా మున్సిపల్ ఎన్నికలపై పోలీసుల ప్రత్యేక దృష్టి - ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐ.పి.ఎస్

**వికారాబాద్ జిల్లా జై భీమ్ న్యూస్:**




వికారాబాద్ జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలలో మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా ప్రజలు అందరూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఎంసీసీ)ను తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, ఐ.పి.ఎస్ సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేందుకు ప్రతి పౌరుడు చట్టానికి లోబడి వ్యవహరించాలని, ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛాయుతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆమె కోరారు. డబ్బు, మద్యం, బహుమతుల ద్వారా ఓటర్లను ప్రభావితం చేసే ప్రయత్నాలు చట్టవిరుద్ధమని హెచ్చరించారు. అక్రమంగా మద్యం విక్రయం మరియు పంపిణీనికి అనుమతి లేదు అని ఎస్పీ స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో అధికారుల లిఖితపూర్వక అనుమతి లేకుండా ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని, మైక్ సెట్లు లేదా శబ్ద కాలుష్యం కలిగించే పరికరాలు వినియోగించరాదని ఎస్పీ స్పష్టం చేశారు. రూ.50,000 వేల కంటే ఎక్కువ నగదు తరలించాలంటే తప్పనిసరిగా సరైన ఆధారాలు చూపించాలని అన్నారు. సోషల్ మీడియా వేదికగా తప్పుడు వార్తలు, రెచ్చగొట్టే సందేశాలు, ద్వేషపూరిత వ్యాఖ్యలు ప్రచారం చేస్తే సైబర్ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ అధికారులకు ఆదేశించారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలు, గతంలో గొడవలు చోటుచేసుకున్న సమస్యాత్మక (సెన్సిటివ్) పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో సందర్శించి, అక్కడి పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు.ఎన్నికల సమయంలో అల్లర్లు సృష్టించే అవకాశం ఉన్నవారు, గతంలో నేర చరిత్ర కలిగిన వ్యక్తులు, రౌడీ షీటర్లను ముందుగానే గుర్తించి, తహసీల్దార్ల ఎదుట బైండోవర్ (బైండ్ - ఓవర్) చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## అక్రమ ఇసుక రవాణాపై టాస్క్ ఫోర్స్ మెరుపు దాడులు: 4 ట్రాక్టర్ల సీజ్. జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా,IPS.

**వికారాబాద్ జిల్లా జై భీమ్ న్యూస్:**

వికారాబాద్ జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, ఐపీఎస్ ఆదేశానుసారం బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని, మంతట్టి గ్రామంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు అందిన ముందస్తు సమాచారం మేరకు జిల్లా టాస్క్ ఫోర్స్ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఎలాంటి అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిబంధనలు అతిక్రమించి ప్రభుత్వ సంపదను కొల్లగొడుతున్న సదరు ట్రాక్టర్లను వెంటనే సీజ్ చేసి, బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ అక్రమ రవాణాకు పాల్పడుతున్న నలుగురు డ్రైవర్లతో పాటు, ట్రాక్టర్ల యజమానులపై కూడా పోలీసులు కేసులు నమోదు చేసి విచారణ చేపడుతున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, ఐపీఎస్ మాట్లాడుతూ.. జిల్లాలో అనుమతులు లేకుండా ఇసుకను తరలించడం చట్టరీత్యా నేరమని, ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా నిరంతర నిఘా కొనసాగుతుందని జిల్లా ఎస్పీ తెలియజేయడం జరిగింది.



# యువ ఓటర్ల చేతిలోనే దేశ భవిష్యత్తు

**కాజీపేట ట్రాఫిక్ సిఐ పిట్టల వెంకన్న**
**ఘనంగా యువ ఓటర్ల అవగాహన సదస్సు మరియు ర్యాలీ**

**ఖాజీపేట : (జై భీమ్ న్యూస్)**

ఓటు ద్వారా మంచి పాలకులను ఎన్నుకోని, దేశ భవిష్యత్తు నిర్ణయించేది యువ ఓటర్లేనని కాజీపేట ట్రాఫిక్ సిఐ పిట్టల వెంకన్న అన్నారు. ఫాతిమా నగర్ లోని సెయింట్ ఆన్స్ నర్సింగ్ కళాశాలలో మేరా యువభారత్ డిపార్ట్మెంట్ , యువజన వ్యవహారాల శాఖ , భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో యువ ఓటర్లకు ఓటు వినియోగం పై అవగాహన మరియు ర్యాలీ గురువారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి నర్సింగ్ కాలేజ్ సుపీరియర్ ఆఫీసర్ జ్యోతి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా హాజరైన వెంకన్న మాట్లాడుతూ యువ ఓటర్లను ఎన్నికల ప్రక్రియలో పాల్గొనేలా ప్రోత్సహించాలని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటర్ గా నమోదు చేసుకొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, అదేవిధంగా హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, సరైన అర్హత పత్రాలు లేకుండా, మద్యపానం సేవించి వాహనాన్ని నడపడం , ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం వంటి చర్యలకు పాల్పడటం నేరమని, తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా కొత్త ఓటరుగా నమోదు చేసుకున్న ఐదుగురు యువ ఓటర్లను సన్మానించి, అభినందించారు. అనంతరం కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ రామ్ కుమార్ రెడ్డి, మాట్లాడుతూ సమాజ అభివృద్ధి మరియు దేశ భవితవ్యం యువత చేతిలోనే ఉందని, యువకులు ఈ దేశ పురోగతిలో భాగస్వాములు కావాలని సూచించారు. తదనంతరం కాళోజి యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ రామ్ కుమార్ రెడ్డి, ట్రాఫిక్ సీఐ పిట్టల వెంకన్న మరియు మీరా యువభారత్ డిప్యూటీ డైరెక్టర్ అన్వేష్ చింతల పచ్చ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించగా, ఈ ర్యాలీ కళాశాల నుండి విద్యార్థులు "నా ఓటు - నా హక్కు, ఓటు మన చేతిలో వజ్రాయుధం, ఓటును అమ్ముకోకు - ఓటును నమ్ముకో" అంటూ నినాదాలు చేస్తూ ఫాతిమా నగర్ కూడలి వద్దకు చేరుకొని ఓటర్లకు ఓటు ప్రాధాన్యం పై అవగాహన కల్పిస్తూ అంతా కలిసి మానవహారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జాతీయ యువజన అవార్డు గ్రహీత డాక్టర్ ఆకులపల్లి మధు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కళ్యాణి, లా గ్రాడ్యుయేట్ రణధీర్ మరియు విద్యార్థినిలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## ట్రాఫిక్ సమస్యలు రాకుండా పోలీసుల చర్యలపై భక్తులు హర్షం




**మేడారం : (జై భీమ్ న్యూస్)**

గతంలో మేడారం జాతర సమయంలో వాహనాల రద్దీ కారణంగా ఎంతో కొంత సమయం వాహనాలు రోడ్లపై నిలిచి పోవడం జరిగింది. కాని ప్రస్తుత మేడారం జాతరలో పోలీసులు తీసుకున్న ముందస్తూ చర్యలతో ట్రాఫిక్ జామ్ సమస్యకు చెక్ పెట్టారు. ప్రదానం ట్రాఫిక్ ఇంచార్జ్ గా వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ నిరంతరం మేడారం వెళ్ళే మార్గాల్లో ట్రాఫిక్ నియంత్రణకై నియమించిన పోలీస్ అధికారులు, సిబ్బంది పనితీరుపై క్షేత్ర స్థాయిలో సమీక్షా చేస్తూ నిరంతరం పోలీసును అప్రమత్తం చేయడం జరుగుతోంది.

## భద్రకాళి మాడ వీధుల అభివృద్ధిపై ప్రతిపక్ష ఆరోపణలకు ఆధారాలతో సమాధానం

### వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

**హనుమకొండ : (జై భీమ్ న్యూస్)**



భద్రకాళి మాడ వీధుల అభివృద్ధిలో భాగంగా ఆలయ ప్రాంగణంలో ఉన్న గుడిసెలను తొలగించి, అక్కడ నివసిస్తున్న వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్న క్రమంలో ప్రతిపక్ష నాయకులు చేస్తున్న ఆరోపణలను వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. పేదలకు అన్యాయం చేయాలనే ఉద్దేశం తనకు లేదని స్పష్టం చేసిన ఆయన, గతంలో ప్రతిపక్షమే అధికారంలో ఉన్న సమయంలో గుడిసె వాసులను తొలగించాలంటూ సమావేశాలు నిర్వహించి నిర్ణయాలు తీసుకున్న వాస్తవాలను గుర్తు చేశారు. అప్పుడు గుడిసెలు తొలగించాలన్నవారే ఇప్పుడు అభివృద్ధి పేరుతో అన్యాయం జరుగుతుందని ఆరోపించడం సిగ్గుచేటు అని మండిపడ్డారు. భద్రకాళి మాడ వీధుల అభివృద్ధి వల్ల నష్టం కలిగే ప్రతి కుటుంబానికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను మంజూరు చేయిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఎవరికీ అన్యాయం జరగకుండా ఇంటికో ఉద్యోగం వచ్చేలా జిల్లా కలెక్టర్‌తో చర్చించామని చెప్పారు. అభివృద్ధి పనులను అడ్డుకోవడమే ప్రతిపక్ష లక్ష్యమని, ప్రజల మేలు కోసం చేపడుతున్న కార్యక్రమాలను వక్రీకరించడం అభివృద్ధి నిరోధక ధోరణికి నిదర్శనమని నాయిని రాజేందర్ రెడ్డి విమర్శించారు. పేదల పక్షాన నిలబడుతూ అభివృద్ధిని కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు.

## కాంగ్రెస్ కక్షపూరిత దోరణికి నిదర్శనం సిట్ నోటీసులు

### మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్


**హనుమకొండ : (జై భీమ్ న్యూస్)**

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కి సిట్ నోటీసుల నేపథ్యంలో దాస్యం వినయ్ భాస్కర్ గురువారం సాయంత్రం బాలసముద్రంలోని రహదారిపై కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రతిష్టను దిగజార్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. తెలంగాణను కొట్లాడి సాధించిన నేతపై కుట్రపూరితంగా కాంగ్రెస్ వ్యవహరిస్తోందన్నారు. 14 ఏండ్ల సుదీర్ఘ పోరాటం, 10 ఏండ్ల పాలనలో కేసీఆర్ గారు తెలంగాణను దేశంలోనే అగ్రభాగన నిలిపిన ఘనత కేసీఆర్దక్కుతుందన్నారు. ప్రజల్లో కేసీఆర్ ని పలచన చేసేందుకే కుంచిత మనసుతో ఈ ప్రభుత్వం నోటీసులు, కమిషన్లు , సిట్‌ల పేరిట వేధింపులకు గురి చేస్తోందన్నారు. ఎన్ని కేసులు, నోటీసులు, సిట్‌లు, ఎన్ని వేసినా ప్రజల తరపున కేసీఆర్ సైన్యంమైన మేము పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సోదా కిరణ్, మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, నాయకులు నరెడ్ల శ్రీధర్, పులి రజినీకాంత్, వినయ్, ఉదిత్, వెంకన్న, రఘు, రాజేష్, రాజు, వీపీ రెడ్డి, శరత్ చంద్ర, రామ్మూర్తి, చందర్, మహమూద్, ఇమ్మడి రాజు, రాజ్‌కుమార్, నయీంజుబేర్, స్నేహిత్, రాకేష్ యాదవ్, షఫీ, వీరస్వామి, వినీల్ రావు, తదితరులు పాల్గొన్నారు.



# అమలు కానీ జీవో నెంబర్ 111

**రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం రద్దు చేశారు.**
**సరస్సుల పరివాహక ప్రాంతాలను కబ్జాలు పెడుతున్నారు.**
**1.32 లక్షల ఎకరాల భూమిలో వ్యాపారాలు నడుస్తున్నాయి.**
**84 గ్రామాల ప్రభావం పూర్తిగా సన్నగిల్లుతుంది.**
**అసైన్డ్ భూములలో వెంచర్లు ఎలా చేస్తున్నారు.**
**1996లో అమల్లోకి వచ్చిన జీవో 111కు విరుద్ధమైన వ్యాపారాలు ఎలా చేస్తున్నారు.**
**భూముల కొనుగోలులో లెక్కలేనంత ప్రముఖులు.**
**ప్రభుత్వ భూములు సైతం రియల్ ఎస్టేట్ రూపంలో ఆగమవుతున్నాయి.**
**ప్రభుత్వ అధికారుల పాత్ర పై తీవ్రమైన అనుమానాలు.**
**డాక్టర్ బరిగెల శివ**



జీవో 111 పరిధిలో భూముల కొనుగోళ్లు: నల్లడబ్బుకు కేంద్రమా...?

**హైదరాబాద్ జై భీమ్ డెస్క్:-**

సరస్సుల పరివాహక ప్రాంతాలను పరిరక్షించడం కోసం 1996లో ఏర్పాటు చేయబడిన జీవో నెంబర్111 ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 5 సెప్టెంబర్ 2024న రద్దుపరిచి 1.32లక్షల ఎకరాల భూమిలో అభివృద్ధి నిర్మాణాలు చేపట్టడం కోసం రియల్ ఎస్టేట్ వ్యాపారులకు డెవలప్మెంట్ పేరు మీద జీవో111ను రద్దు పరిచి ప్రభుత్వ భూములలో రియల్ ఎస్టేట్ వెంచర్ల రూపంలో వ్యాపారాలు చేసుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం వెసులుబాటు కల్పించినట్లుగా కనిపిస్తుందని జై భీమ్ సంస్థల చైర్మన్ డాక్టర్ బరిగెల శివ ఆవేదన వ్యక్తం చేశారు. ఆవిరి తట్టు ప్రాంతాలను రక్షించాలనే ముఖ్య ఉద్దేశంతో ఏర్పడిన జీవో111,ఉస్మాన్ సాగర్,హిమాయత్ సాగర్ పరివాహక ప్రాంతాలను,వ్యాపారాలకు వాడుకుంటున్నారన్నారు. ప్రభుత్వ భూములలో అసైన్డ్ భూములలో లెక్కలేనన్ని వెంచర్లు ఏర్పడుతున్నాయన్నారు. జీవో111ను 29 సంవత్సరాల తర్వాత రద్దు చేయడం అనేది ఊహించడానికి అగమ్య గోచరంగా ఉందన్నారు. నీటి తట్టు ప్రాంతాలను ప్రభుత్వం సుందరీకరణ రూపంలో అభివృద్ధి చేయాలి గాని రియల్ ఎస్టేట్ వ్యాపారానికి మార్గాలను ఏర్పరిచి అభివృద్ధి రూపంలో 84 గ్రామాలలో గల ప్రభుత్వ భూములను కబ్జాలు పెడుతూ వెంచర్లు చేస్తుండడం భవిష్యత్తు తరంలో రెండు సరస్సులపై తీవ్రమైన ప్రభావాన్ని చూపిస్తుందన్నారు.

జీవో111 కు విరుద్ధమైన దాడి వివరాలు.

తెలంగాణలో,జీవో 111 అనేది హైదరాబాద్‌లోని ఉస్మాన్ సాగర్ , హిమాయత్ సాగర్ సరస్సుల పరీవాహక ప్రాంతాలను పట్టణ అభివృద్ధి నుండి రక్షించే కీలకమైన 1996 ప్రభుత్వ ఉత్తర్వును సూచిస్తుంది, నీటి వనరులు పచ్చని ప్రదేశాలను సంరక్షించడానికి నిర్మాణాన్ని పరిమితం చేస్తుంది, అయితే దాని అమలు ఇటీవలి సంభావ్య స్క్రాపింగ్ హైదరాబాద్ రియల్ ఎస్టేట్ పర్యావరణానికి ప్రధాన ఆందోళనలుగా ఉన్నాయి.

జీవో 111 ముఖ్య అంశాలు:

ఉద్దేశ్యం:

కాలుష్యాన్ని నివారించడం నీటి భద్రతను నిర్ధారించడం ద్వారా హైదరాబాద్ నీటి సరఫరాను రక్షించడం.

పరిమితులు:

వ్యవసాయం మరియు వినోదం కోసం భూ వినియోగంపై కఠినమైన నియమాలతో, 60శాతం ప్రాంతం తెరిచి ఉండాలని ఆదేశించబడింది.

ప్రభావిత ప్రాంతాలు: ట్విన్ లేక్స్ పరీవాహక మండలాలను కవర్ చేస్తుంది, ఇది గండిపేట, చిల్కూరు, చుట్టుపక్కల గ్రామాల సమీపంలోని పెద్ద భూభాగాలను ప్రభావితం చేస్తుంది.

రియల్ ఎస్టేట్ ప్రభావం:

తీవ్రంగా పరిమితం చేయబడిన అభివృద్ధి, ఈ సున్నితమైన మండలాల్లో భూమి ఆమోదాలు, ఆస్తి విలువలు, రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుల భవిష్యత్తును ప్రభావితం చేస్తుంది.

ఇటీవలి పరిణామాలు:


అభివృద్ధి ఒత్తిళ్లు, పర్యావరణ సమస్యల కారణంగా దాని తొలగింపు లేదా మార్పు గురించి తెలంగాణ ప్రభుత్వం చర్చించింది, ఇటీవలి నివేదికలు దీనిపై నిర్ణయం తీసుకోవచ్చని సూచిస్తున్నాయి. సారాంశంలో, జీవో 111 అనేది హైదరాబాద్‌కు ఒక ముఖ్యమైన పర్యావరణ నియంత్రణ, దాని హోదా కీలకమైన ప్రాంతాలలో నీటి భద్రత భూ అభివృద్ధిని ప్రత్యక్షంగా ప్రభావితం చేస్తుంది.

పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా అమల్లోకి వచ్చిన జీవో 111 వాస్తవంగా అమలవుతుందా, లేక చట్టాల అమలు పేరుతో కాగితాలకే పరిమితమైందా అన్న ప్రశ్నలపై ఇప్పుడు తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. చట్టం ఉన్నా అమలు కనిపించకపోవడం, అమలు కావాల్సిన చోట వ్యవస్థ మౌనంగా ఉండటం, చట్టపాలనపై అనుమానాలను మరింత బలపరుస్తోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. జీవో 111 పరిధిలో, శంకర్ పల్లి, మొయినాబాద్ మండలాల్లో ముఖ్యంగా నిరంతరం వార్తల్లో నిలిచే జనవాడ లాంటి రెవెన్యూ గ్రామాల పరిధిలో జరిగిన భూకొనుగోళ్లు సాధారణ రియల్ ఎస్టేట్ లావాదేవీలుగా కనిపించడం లేదన్న విమర్శలువెల్లువెత్తుతున్నాయి. కార్డు విలువ కేవలం 50 లక్షలుగా నమోదు చేసి, అదే భూములను మార్కెట్‌లో 10 కోట్ల నుంచి 15 కోట్ల వరకు కొనుగోలు చేసినట్లు వస్తున్న సమాచారం, (ఆ ప్రాంతంలో ఎవరిని అడిగిన ఎకరం 10 కోట్ల నుండి 15 కోట్ల రూపాయల అని చెప్తుంటారు.)నల్లడబ్బు ప్రవాహానికి స్పష్టమైన సంకేతాలుగా విమర్శకులు పేర్కొంటున్నారు. ఇది కేవలం పన్నుల ఎగవేత కాదు, అక్రమ ఆదాయాన్ని భూముల రూపంలో మార్చి వ్యవస్థ కళ్లకు గంతలు కట్టే ప్రక్రియగా మారుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ భూముల కొనుగోళ్ల వెనుక రాజకీయంగా, పరిపాలనపరంగా ప్రభావం ఉన్న వర్గాలు, రాజ్యాంగ పరిరక్షక స్థానాల్లో ఉన్నవారు, పెద్ద వ్యాపార, విద్యాసంస్థల నిర్వాహకులు ఉన్నారన్న చర్చ కూడా ఈ వ్యవహారంపై మరిన్ని ప్రశ్నలు లేవనెత్తుతోంది. చట్టాలను అమలు చేయాల్సిన వ్యవస్థలే చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నాయన్న విమర్శలు బలపడుతున్నాయి. ఇంకో ఆందోళనకర అంశం ఏమిటంటే, 10 కోట్లకు పైగా విలువైన భూముల్లో, బ్యాంకు లోన్ వచ్చే అవకాశమే లేని చోట, వందల ఎకరాల మేర వెంచర్లు ఏర్పాటు అవుతున్నాయి. గుంటల్లో రిజిస్ట్రేషన్ అయిన భూములను గజాలుగా విడగొట్టి, వేల గజాలుగా క్రయవిక్రయాలు జరగడం, స్థలాలకు లోన్ రాకపోయినా నిర్మాణాలకు లోన్ లేకపోయినా ఇంద్రభవనాలను తలపించే విలాసవంతమైన నివాసాలు, ఎకరాల మేర కన్వెన్షన్ హాల్స్, స్కూళ్ల నిర్మాణాలు ఎలా సాధ్యమయ్యాయన్న ప్రశ్నలకు ఇప్పటికీ సమాధానం లేదన్న విమర్శలు కొనసాగుతున్నాయి. పర్యావరణ పరిరక్షణ పేరుతో సామాన్యులపై కఠినంగా అమలయ్యే జీవో 111, ప్రభావశీలుల విషయంలో ఐచ్ఛిక చట్టంగా మారిందా అన్న అనుమానం తీవ్రంగా వ్యక్తమవుతోంది. నిర్మాణాలు జరుగుతున్నా, వెంచర్లు వెలుస్తున్నా, పర్యవేక్షణ యంత్రాంగం నిర్వీర్యంగా కనిపించడం పరిపాలనా వైఫల్యమా, లేక ఉద్దేశపూర్వక నిర్లక్ష్యమా అన్న సందేహాలకు తావిస్తోంది. ఇది చట్టపాలనపై ప్రజల నమ్మకాన్ని దెబ్బతీస్తోందన్న విమర్శలు మరింత తీవ్రమవుతున్నాయి. ఈ పరిణామాలు కేవలం ఒక ప్రాంతానికి సంబంధించిన భూవ్యవహారాలుగా మాత్రమే చూడలేమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇవి చట్టపాలన, పారదర్శకత, ప్రజాధన భద్రతకు సంబంధించిన గంభీరమైన అంశాలుగా మారాయని విమర్శకులు హెచ్చరిస్తున్నారు. ఎవరు ఎంత పెట్టారు, ఆ డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది, అక్రమ ఆదాయం ఎలా భూములుగా మారింది అన్న అంశాలపై స్వతంత్రంగా, లోతుగా విచారణ జరగాల్సిందేనన్న డిమాండ్ బలంగా వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో జీవో 111 పరిధిలో జరిగిన భూకొనుగోళ్లపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సీబీఐ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలు తక్షణమే దృష్టి పెట్టాలన్న డిమాండ్ ఊపందుకుంటోంది. ఇప్పటికైనా సమగ్ర విచారణ ప్రారంభించకపోతే, జీవో 111 పరిధి మొత్తం ఆర్థిక నేరగాళ్లకు శాశ్వత ఆశ్రయంగా మారే ప్రమాదం ఉందన్న హెచ్చరికలు తీవ్రంగా వినిపిస్తున్నాయి

## అవధాన ప్రక్రియ - పోస్టర్ ఆవిష్కరణ

**కేయూ క్యాంపస్ : (జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ: కాకతీయ విశ్వవిద్యాలయం 50 సంవత్సరాల స్వర్ణోత్సవ వేడుకలో భాగంగా “తెలుగు శాఖ మరియు వరంగల్ పద్య కవిత వేదిక” సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజుల అవధాన ప్రక్రియ ఫిబ్రవరి 22, 23 మరియు 24 తేదీన రాష్ట్రస్థాయిలో నిర్వహించబడుతుంది. దీనికి సంబంధించిన గోడ పత్రికను ఈరోజు కాకతీయ విశ్వవిద్యాలయ ఉపకులపతి కర్నాటి ప్రతాప్ రెడ్డి, తెలుగు శాఖ అధ్యక్షులు మామిడి లింగయ్య, పాలకమండలి సభ్యులు చిర్ర రాజు, డాక్టర్ రమ, డాక్టర్ సుదర్శన్, అవధాని శ్రీ రామ్, తెలుగు శాఖ అధ్యాపక బృందం డా. కర్రే సదాశివ్, డా. బానోత్ స్వామి తో కలిసి అవధాన కార్యక్రమ అధ్యాపకులు పత్రిక ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు..



## సెంటర్ ఫర్ ఉమెన్ స్టడీస్ పోస్టర్ విడుదల

**కేయూ క్యాంపస్ : (జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయ మహిళా సెంటర్ ఫర్ ఉమెన్ స్టడీస్ అండ్ ఎంపవర్మెంట్ అద్వర్యంలో మార్చి 9, 10 లలలో రెండు రోజుల జాతీయ సదస్సు “లిటరేచర్, లీడర్షిప్ అండ్ ఇన్నోవేషన్ : విమెన్ షేపింగ్ వికసిత్ భారత్ 2047 (లీటరేచర్ లీడర్షిప్ అండ్ ఇన్నోవాషన్ : ఉమెన్ షాపింగ్ విక్సిట్ భారత్ 2047)” గోడ పత్రిక ను వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి చేతుల మీదుగా అవిష్కరించినట్టు, సెంటర్ ఫర్ విమెన్ స్టడీస్ అండ్ ఏమ్పోవేర్మెంట్ సమన్వయ అధికారిణి డాక్టర్ బి. దీపా జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు, ఆసక్తి ఉన్న అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు సంబందిత రుసుం, కాంపస్ కాలేజీ ప్రిన్సిపాల్ గారు నాన్ యూనివర్సిటీ ఫండ్ లో చెల్లించి పత్రాలు సమర్పించ వచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమం లో పాలక మండలి సభ్యురాలు డాక్టర్ బి. రమ, ఆచార్య పి. వరలక్ష్మి, ఆచార్య పి. అమరావేణి, డాక్టర్ కే. మమత, ఆచార్య సి. జే. శ్రీలత, ఆచార్య టి. సవితా జ్యోత్స్న, డాక్టర్ ఎం. స్వర్ణలత పాల్గొన్నారు, మరిన్ని వివరాలు విశ్వవిద్యాలయ వెబ్ సైట్ ఙఙఙ.ఝుౕఞఅఝ.ఖఙ.అఅ చూడవచ్చు అని ఆమె అన్నారు.



# మామునూరు ఎయిర్పోర్టుకు భూమి అప్పగించడం

**చరిత్రలో నిలిచిపోయే రోజు**

**హైదరాబాద్ (జై భీమ్ న్యూస్)**

అదిలాబాద్,కొత్తగూడెం ఎయిర్ పోర్టులను త్వరితగతన పూర్తి చేయాలి బేగంపేట సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ప్రజా ప్రభుత్వం ఏర్పడగానే మామునూరు ఎయిర్పోర్ట్ కు అవసరమైన భూమిని సేకరించి ఈరోజు కేంద్ర విమానయాన శాఖ కు అప్పగించడం చరిత్రలో నిలిచిపోయే రోజు అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. వరంగల్ జిల్లాలోని మామునూరు ఎయిర్పోర్ట్ కు అవసరమైన 300 ఎకరాల భూమిని కేంద్ర వైమానిక శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుకు అప్పగించడం చరిత్రలో నిలిచిపోయే రోజు అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. గురువారం బేగంపేట విమానాశ్రయంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగించారు. మామునూరు తరహాలోనే ఆదిలాబాద్, కొత్తగూడెం పట్టణాల్లో ఏర్పాటు చేయదలచిన ఏర్పోర్ట్ల నిర్మాణం పనిని వేగవంతం చేయాలని కేంద్రమంత్రికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు. తెలుగు గడ్డపై పుట్టిన వ్యక్తి కేంద్రంలో వైమానిక శాఖ మంత్రిగా ఉండడం అభినందనీయమని వారు తెలంగాణ రాష్ట్ర అవసరాలను గుర్తిస్తూ సహకారం అందించాలని డిప్యూటీ సీఎం కోరారు. 2007లోనే ఎయిర్పోర్ట్ అథారిటీతో మామునూరు ఎయిర్పోర్ట్ నిర్మాణానికి ఒప్పందం చేసుకున్నప్పటికీ గత పది సంవత్సరాలు పరిపాలించిన వారు పట్టించుకోకపోవడంతో వరంగల్ ఎయిర్పోర్ట్ నిర్మాణం ఆలస్యమైందని డిప్యూటీ సీఎం తెలిపారు. హైదరాబాద్ కాకుండా తెలంగాణ రాష్ట్రంలోని టూ టైర్ సిటీలు అయినా కొత్తగూడెం ఆదిలాబాద్ లో ఎయిర్పోర్ట్ నిర్మాణం చేయాలని కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టగానే రామ్మోహన్ నాయుడును రాష్ట్ర



క్యాబినెట్ మొత్తం కోరగా వారు సానుకూలంగా స్పందించి ముందుకు వెళ్లడం శుభసూచకం అని తెలిపారు. మామునూరు ఎయిర్పోర్ట్ 1930లో నిజాం కాలంలోనే పనులు మొదలుపెట్టారని ఇది ఆనాడు దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద ఎయిర్పోర్ట్ అని డిప్యూటీ సీఎం తెలిపారు. మామునూరు ఎయిర్పోర్ట్ భూ సేకరణకు 300 కోట్లు అవసరమని గుర్తించి వాటిని వెంటనే విడుదల చేసి వడివడిగా అడుగులు వేసి భూసేకరణ ప్రక్రియను పూర్తి చేశామని డిప్యూటీ సీఎం తెలిపారు.

# నమ్మకం లేకపోతే ఏ బంధం నిలవదు..!


వివాహ జీవితం సుఖంగా సాగాలంటే ప్రేమ, గౌరవం, నమ్మకం, క్షమ, సానుభూతి వంటి విలువలతో నిండిన అనుబంధం కావాలి. ఇందుకు సద్గురు ఇచ్చిన మార్గదర్శకాలు ఎంతో ఉపయోగపడతాయి. ఈ విలువలు జీవిత భాగస్వాముల మధ్య బంధాన్ని బలపరచడమే కాకుండా.. జీవితాన్ని సంతోషంగా జీవించడానికి ఉపయోగపడతాయి. వివాహం అనేది కేవలం ఒక సంప్రదాయ సంబంధం కాదు. సద్గురు ఏం చెబుతున్నారో తెలుసా..? వివాహం అనేది మన జీవితంలో మనకు తోడుగా ఉండే వ్యక్తిని ఎంచుకోవడమే. శారీరక, భావోద్వేగ, మానసిక, ఆర్థిక, సామాజిక అవసరాలను పూరించగల వ్యక్తి జీవిత భాగస్వామిగా ఉండాలి. ఈ బంధం నిశ్చలంగా నిలవాలంటే దానికి శ్రద్ధ అవసరం. ఏ బంధమైనా రోజురోజుకూ మారుతూ ఉంటుంది. మనం నిర్లక్ష్యం చేస్తే దూరమవుతుంది. కాబట్టి మన జీవిత భాగస్వామితో అనుబంధాన్ని ప్రేమగా, శ్రద్ధగా చూసుకోవాలి. ఒక మంచి వివాహ బంధానికి ముఖ్యమైన అంశం సంభాషణ. మనసులో ఉన్న విషయాలను బహిరంగంగా చెప్పుకోవడం ద్వారా భావోద్వేగాలు సమతుల్యతలో ఉంటాయి. ఇది ఇద్దరినీ దగ్గర చేస్తుంది. అలాగే ఒకరినొకరు గౌరవించడం కూడా ఎంతో అవసరం. వివాహం వల్ల మన వ్యక్తిత్వాన్ని కోల్పోవాల్సిన పని లేదు. ప్రతి వ్యక్తికీ తన సొంత అభిప్రాయాలు ఉంటాయి. అవి భిన్నంగా ఉన్నా.. గౌరవించాలి. ఆ గౌరవం బంధాన్ని నిలబెట్టే శక్తిగా ఉంటుంది.ఇక నమ్మకం గురించి చెప్పాలంటే.. అది లేకుండా ఎలాంటి సంబంధం నిలవదు. భర్తా భార్యల మధ్య పరస్పర నమ్మకం పెరిగేలా మాట్లాడుకోవాలి. ఒకరి నమ్మకాన్ని మరొకరు దెబ్బతీయకుండా జాగ్రత్త పడాలి. నమ్మకమే బంధాన్ని బలంగా ఉంచుతుంది. వివాహం అనగా ఒకరి ప్రపంచంలో మరొకరిని కలిపేసుకోవడం కాదు. ప్రతి ఒక్కరికీ వ్యక్తిగతంగా ఎదిగే అవకాశం ఉండాలి. కొన్ని విషయాల్లో స్వేచ్ఛ ఇవ్వడం ద్వారా బంధం మరింత ఆరోగ్యంగా మారుతుంది. మానవ సంబంధాల్లో మనుషుల మధ్య అంచనాలు, అబద్ధాలు, అపార్థాలు సాధారణం. అప్పుడు క్షమించగలగడం ఎంతో అవసరం. చిన్నచిన్న సమస్యల్ని పట్టుకొని బంధాన్ని బలహీనంగా మార్చుకోవద్దు. వ్యక్తిగత లక్షణాలను అంగీకరించగలగడం ద్వారా మన



హృదయంలో దయ, ప్రేమ పెరుగుతుంది. మన భాగస్వామిలో ఉన్న అసంపూర్ణతలను అంగీకరించగలగడం ద్వారా జీవితం మరింత సులభంగా సాగుతుంది. జీవిత భాగస్వామి చేసిన పనుల్ని బాధ్యతగా కాకుండా ప్రేమతో చూసుకోవాలి. మనకు చేయబడ్డ సహాయానికి కృతజ్ఞత చూపడం ద్వారా బంధం బలపడుతుంది. భార్యా భర్తలు ఒకే ఇంట్లో ఉన్నా.. కొన్ని ప్రత్యేకమైన సందర్భాలు కలిసి గడపడం అవసరం. కలిసి విహారయాత్రలు, భోజనాలు, లేదా మంచి సమయాన్ని గడపడం ద్వారా ప్రేమ మరింత పెరుగుతుంది. ఈ ప్రయాణంలో నవ్వు ఎంతో కీలకమైనది. ఒకరితో ఒకరు నవ్వుతూ మాట్లాడుకోవడం వల్ల మధ్యలో ఉండే ఒత్తిడులు పోతాయి. ఈ విధంగా సాన్నిహిత్యం పెరుగుతుంది. సద్గురు చెప్పిన ఈ సూచనలు వివాహ బంధాన్ని ప్రేమతో, శాంతితో నింపడానికి చాలా ఉపయోగపడతాయి. ఈ బంధం సాధారణంగా ఉండకూడదంటే, ఇద్దరూ ఒకరినొకరు అర్థం చేసుకునే మనసుతో, పరస్పర గౌరవంతో, క్షమించగల స్వభావంతో జీవించాలి. ఇలాంటి విలువలు ఉన్నప్పుడు మాత్రమే ఈ అనుబంధం బలంగా మారుతుంది.

# మీ ఆరోగ్యం మీ చేతుల్లోనే

శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయి పెరిగినప్పుడు అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుంది. ఈ సమస్యలు ముఖ్యంగా ఆర్థరైటిస్, కిడ్నీ సంబంధిత వ్యాధుల రూపంలో కనిపిస్తాయి. అధిక యూరిక్ యాసిడ్ కారణంగా జాయింట్లలో నొప్పులు, వాపులు మొదలవుతాయి. గ్రీన్ కలర్ ఫుడ్స్ దినచర్యలో భాగం చేస్తే ఈ సమస్యను సహజంగా నివారించవచ్చు. పాలకూరలో శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇందులో ఉన్న మెగ్నీషియం శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయిని సమతుల్యంగా ఉంచడంలో ముఖ్యపాత్ర పోషిస్తుంది. పాలకూరను రోజూ తీసుకోవడం వల్ల శరీరానికి పుష్కలమైన పోషకాలు అందించడమే కాక.. ఆరోగ్యాన్ని కాపాడేందుకు సహాయపడుతుంది.పచ్చి బఠానీలలో ఫైబర్ అధికంగా ఉంటుంది.. ఇది శరీరానికి కావలసిన శక్తిని అందిస్తుంది. వీటిలో ఉన్న యాంటీఆక్సిడెంట్లు శరీరాన్ని డిటాక్స్ చేయడంలో తోడ్పడతాయి. గౌట్ వంటి సమస్యలను తగ్గించడానికి ఈ బీన్స్ చాలా ఉపయోగపడతాయి.గ్రీన్ టీ శరీరంలోని హానికరమైన వ్యర్థాలను బయటకు పంపడంలో సహాయపడుతుంది. ఈ టీలో ఉండే యాంటీఆక్సిడెంట్లు, ఆహ్లాదకరమైన రుచి యూరిక్ యాసిడ్ స్థాయిలను తగ్గించడంలో తోడ్పడతాయి. ప్రతిరోజూ ఒక కప్పు గ్రీన్ టీ తాగడం వల్ల మంచి ఫలితాలు పొందవచ్చు. సెలరీలో ఉన్న పోషకాలు మూత్రపిండాల పనితీరును మెరుగుపరుస్తాయి. ఇది శరీరంలోని వాపును తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. యూరిక్ యాసిడ్ స్థాయిని సమతుల్యంగా ఉంచడంలో ఈ ఆకుకూర సహాయపడుతుంది. అవకాడోలో ఆరోగ్యకరమైన కొవ్వులు అధికంగా ఉంటాయి. ఈ పండు శరీరానికి అవసరమైన ఎనర్జీ అందించే ప్రక్రియను మెరుగుపరుస్తుంది. ఇది శరీరంలోని వ్యర్థ పదార్థాలను వెలుపలికి పంపడంలో సహాయపడుతుంది. యూరిక్ యాసిడ్ స్థాయిని తగ్గించడానికి అవకాడో ఉపయోగపడుతుంది. ఆస్పరాగస్‌లో ఫైబర్, ప్యూరిన్లు సమతుల్యంగా ఉంటాయి. ఇది శరీరంలోని హానికరమైన పదార్థాలను తగ్గించడంలో సహాయపడుతుంది. కాబట్టి ఆస్పరాగస్ ను తగిన మోతాదులో తీసుకోవడం మంచిది.గ్రీన్ బీన్స్ లో ప్యూరిన్లు తక్కువగా ఉంటాయి.. అందుకే ఇవి యూరిక్ యాసిడ్ స్థాయిని నియంత్రించడంలో సహాయపడతాయి.



# అమనగల్ మున్సిపాలిటీ 14వ వార్డు అభివృద్దే లక్ష్యం

**వస్పుల సాయిలు**




**అమనగల్(జై భీమ్ న్యూస్)**

అమనగల్ మున్సిపాలిటీ 14వ వార్డు సమగ్ర అభివృద్ధికి తనవంతు పూర్తి సహకారం అందిస్తానని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ బలపరిచిన అభ్యర్థి వస్పుల సాయిలు తెలిపారు.గురువారం ఆయన అధికారికంగా తన నామినేషన్‌ను దాఖలు చేశారు. ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు,స్థానిక నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా వస్పుల సాయిలు మాట్లాడుతూ బీఆర్ఎస్ అధినేత కే. చంద్రశేఖర్ రావు రాష్ట్రాన్ని అభివృద్ధిసంక్షేమం అనే రెండు దారుల్లో సమతుల్యంగా ముందుకు నడిపించిన నాయకుడని అన్నారు. ఆయన అమలు చేసిన సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో నిజమైన మార్పు తీసుకొచ్చాయని పేర్కొన్నారు. అదే స్ఫూర్తితో 14వ వార్డులో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తానని తెలిపారు. డ్రైనేజీ సమస్యల పరిష్కారం, రోడ్ల అభివృద్ధి, తాగునీటి ఇబ్బందుల నివారణతో పాటు పేదల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. ప్రజల ఆశీర్వాదంతో గెలుపు సాధించి, 14వ వార్డును అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే తన ప్రధాన లక్ష్యమని వస్పుల సాయిలు ధీమా వ్యక్తం చేశారు.

# వర్ధన్నపేటలో బీఆర్ఎస్‌లోకి నేతల చేరిక



**జై భీమ్ న్యూస్ (వర్ధన్నపేట)**

వర్ధన్నపేట నియోజకవర్గానికి చెందిన గుబ్బడు తండా గ్రామ నాయకులు నేతవత్ రాజేందర్ మరియు ఆయన భార్య షీబారాణి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్ పార్టీలో చేరారు.మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మరియు మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ నాయకత్వంలో జరిగిన కార్యక్రమంలో వారికి బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.రాష్ట్ర అభివృద్ధి దిశగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన కార్యక్రమాలు, అలాగే కేటీఆర్ సూచిస్తున్న అభివృద్ధి ఆలోచనలకు ఆకర్షితులై తాము బీఆర్ఎస్ పార్టీలో చేరినట్లు నేతవత్ రాజేందర్ తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ, వర్ధన్నపేట ప్రాంత అభివృద్ధికి కృషి చేసే ప్రతి ఒక్కరికి బీఆర్ఎస్ పార్టీలో స్థానం ఉంటుందని పేర్కొన్నారు. కొత్తగా పార్టీలో చేరిన నాయకులకు స్థానిక నేతలు, కార్యకర్తలు అభినందనలు తెలియజేశారు.

# చీజ్ ఆరోగ్యానికి ఎంత మంచిదంటే..?



చీజ్ తో తయారు చేసే ఆహార పదార్థాలు ఎంతో రుచిగా ఉంటాయి. ఇంకా అలాగే చీజ్ కూడా మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. చీజ్ ను తగిన మోతాదులో తీసుకోవడం వల్ల మనం చాలా ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. ఈ చీజ్ ను మితంగా తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. చీజ్ లో క్యాల్షియం చాలా ఎక్కువగా ఉంటుంది. ఇది ఎముకలను ధృడంగా ఇంకా ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. చీజ్ ను తీసుకోవడం వల్ల ఎముకలు గుల్లబారడం ఇంకా ఎముకల పగుళ్లు వంటి సమస్యలు రాకుండా ఉంటాయి.చీజ్ లో ప్రోటీన్ అనేది ఎక్కువగా ఉంటుంది. కండరాలను ఆరోగ్యంగా ఉంచడంలో, దేహ పుష్టికి ప్రోటీన్ అనేది ఎంతో సహాయపడుతుంది. అంతేకాకుండా చీజ్ లో విటమిన్ బి12, విటమిన్ ఎ, ఫాస్పరస్ ఇంకా జింక్ వంటి ఎన్నో పోషకాలు ఉన్నాయి. ఇవి సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించడంలో, శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచడంలో, చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో ఇలా చాలా రకాలుగా సహాయపడతాయి. అలాగే బరువు తగ్గడంలో కూడా చీజ్ మనకు సహాయపడుతుంది. ఈ చీజ్ లో క్యాలరీలు, ప్రోటీన్, కొవ్వు పదార్థాలు ఎక్కువగా ఉన్నప్పటికి దీనిని కొద్ది మోతాదులో తీసుకోగానే కడుపు నిండిన భావన కలుగుతుంది.ఇంకా చీజ్ ను తీసుకోవడం వల్ల త్వరగా ఆకలి వేయకుండా ఉంటుంది. అందువల్ల మనం ఇతర ఆహారాలను తక్కువగా తీసుకుంటాము.ఇంకా అలాగే కొన్ని రకాల చీజ్ లు ప్రోబయాటిక్స్ ను ఎక్కువగా కలిగి ఉంటాయి. ఇవి పొట్ట ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఇంకా జీర్ణక్రియ సాఫీగా సాగేలా చేయడంలో దోహదపడతాయి. ఈ విధంగా చీజ్ మన ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుందని దీనిని తగిన మోతాదులో తీసుకోవడం వల్ల మనం సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.కాబట్టి ఖచ్చితంగా చీజ్ ని తినండి. అనేక ఆరోగ్య ప్రయోజనాలని పొందండి.